ఆంధ్రప్రభ

09/01/2023

# కష్టపడే యువతకు ఎన్నో అవకాశాలు

## నిజాయితీగా కష్టపడితే తప్పక విజయం సాధిస్తారు
## మెట్రో రైల్ ఎండీ. ఎన్వీఎస్.రెడ్డి



ఎన్వీఎస్.రెడ్డి ఎదుట మోకరిల్లి అభివాదం చేస్తున్న గంగిరెద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మెట్రో రైల్ ఎండీ. ఎన్వీఎస్.రెడ్డి



సంప్రదాయ హరిదాసుతో మెట్రో రైల్ ఎండీ. ఎన్వీఎస్.రెడ్డి

హైదరాబాద్, జనవరి 8 (ప్రభ న్యూస్): మనదేశంలో కష్టపడే యువతకు ఎన్నో అవకాశాలున్నాయని, నిజాయితీగా కష్టపడితే, ఏ రంగంలోనైనా యువత తప్పక విజయం సాధిస్తారని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్. రెడ్డి అన్నారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఏవీ కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో నాయకత్వ లక్షణాలు - పోరాట పటిమ అనే అంశంపై ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్వీఎస్.రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు వచ్చినపుడు బెదిరిపోవద్దని, ఎవరు ఎలా ఆక్షేపించినా, మొక్కవోని దీక్షతో విజయపథం వైపు ముందుకు సాగాలన్నారు. కళాశాల యువత అధికంగా పాల్గొన్న ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో నిర్మాణ సమయంలో తాను ఎదుర్కొన్న అనేక సమస్యలు - సవాళ్లను సంక్షిప్తంగా వివరించారు. మెట్రో నిర్మాణపు రోజుల్లో తనని నిందించని వారులేరని, ఒక సందర్భంలో తన గురువు శ్రీధరన్ కూడా తనను తప్పు పట్టారని ఆనాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు.

ఇటీవల తాను రాసిన కవితా సంపుటి మేఘసందేశంలోని కొన్ని కవితలను చదివి వినిపిస్తూ యువతను ఉత్తేజపరిచారు. సముద్రంలో ఓడ మునిగిపోతుంటే, ఎలుకలు కూడా పారిపోతాయన్న నానుడిని యువత గుర్తుంచుకోవాలన్నారు. దేని గురించి భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని యువతను ప్రోత్సహించారు.

ముందుగా ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, పల్లె పాటలు వంటి పలు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. రంగోలీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు పండితులు అద్దంకి శ్రీనివాస్ తెలుగు మాటల్లో తెలివి మాటలు అనే అంశంపై చమత్కారంగా ప్రసంగించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వీఎల్.ఇందిరా దత్, ఎస్.విజయలక్ష్మిలు తెలుగు సమాఖ్య ఆశయాలు, సంక్రాంతి తెలుగు పండుగ గొప్పదనంపై ప్రసంగించారు.